క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగను పంపిణీ చేస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని స్థానిక సర్పంచ్ ఎస్.పి.నారాయణస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవిటి–సోంపేట ఈదుపురం స్టేట్ హైవేలో వెళ్లేవారికి ఈ వేసవిలో చలివేంద్రం ఉపయోగంగా ఉంటుందన్నారు. తొలి రోజున మంచినీటితోపాటు, మజ్జిగను పంపిణీ చేశారు. పొందల భాస్కరరావు, ఎస్పీ రవి పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు

టెక్కలి: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని కార్మిక శాఖాధికారి ఆర్.రాధాకుమారి సూచించారు. టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో వివిధ పరిశ్రమలు, ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలు, ఇటుక బట్టీలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పని ప్రదేశాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏపీవో హరి ప్రసాద్ ఉన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సోంపేట: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వ చెల్లించాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యారంగ, ఆర్థిక సమస్యలపై ఈ నెల 31వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సోంపేటలో వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ మాట్లాడారు. విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, బకాయిలు చెల్లించాలన్నారు. సంఘ ప్రతినిధులు మాధవరావు, మురళి నాయకో, సుదర్శన్ బెహరా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ


ధనుష్‌ను పరామర్శిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: నందిగాం మండలం భర్తుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొప్పల ధనుష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ధనుష్‌ను పరామర్శించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, పార్టీ టెక్కలి పట్టణ, నందిగామ మండల అధ్యక్షులు టి.కిరణ్, టి.ఫాల్గుణరావు, నాయకులు కె.బాలకృష్ణారావు, కిల్లి అజయ్‌కుమార్, జె.జయరాం, బి.రాజేష్ ఉన్నారు

నాటుసారాను సమూలంగా నిర్మూలిద్దాం

కంచిలి: నాటుసారాను గ్రామస్థాయి నుంచే సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు అన్నారు. జలంత్రకోట గ్రామంలో నవోదయం–2 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించి సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సారాను ప్రోత్సహించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా సామూహికంగా సారా అమ్మకాలను నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ డొక్కరి బ్రహ్మానందం, సంజయ్ పండా, సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబీ, ఎక్సైజ్ అధికారులు ఎం.శ్రీనివాసరావు, జి.రమణ, వీఆర్వో ఆర్.క్రిష్ణారావు పాల్గొన్నారు.

మంచినీరు ఇప్పించండమ్మా..

- ఎమ్మెల్యే శిరీష ఎదుట శాసనాం మహిళల ఏకరువు


మంచినీటి సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న మహిళలు

కాశీబుగ్గ: మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని.. పరిష్కారం చూపాలని శాసనాం గ్రామానికి చెందిన మహిళలు వేడుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం కలిసి ఏకరువు పెట్టారు. తమ గ్రామం పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలానికి చెందకుండా మధ్యలో ఉండిపోవడంతో మంచినీటికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపాలా, పంచాయతీలో ఉంచాలో గ్రామస్తులే నిర్ణయం తీసుకొని తమకు తెలియజేయాలన్నారు. ప్రస్తుతానికి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు.

రియల్ దందా!


సోంపేట-కవిటి ప్రధాన రోడ్డుకు అనుకుని వేసిన లే అవుట్

- ఇష్టారాజ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం
- నిబంధనలకు తిలోదకాలు


బేసిరామచంద్రాపురం పొలాల్లో సిద్ధం చేస్తున్న లేఅవుట్

సోంపేట: రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. సోంపేట ప్రధాన కేంద్రంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా సాగుతుందనే చెప్పాలి. సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే ఆశతో ఉన్నవారికి లేనిపోని మాటలు చెప్పి ప్లాట్లు అంటగడుతున్నారు. తీరా వివిధ కారణాలతో ఆటంకాలు వస్తుండడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారు. మండలం కేంద్రం సోంపేట నుంచి కవిటి వెళ్లే రాహదారికి ఆనుకుని సుమారు ఐదు ఎకరాల లే అవుట్, బేసిరామచంద్రాపుం వెళ్లేదారిలో పొలాల్లో వేస్తున్న లేఅవుట్లకు ఎటువంటి అనుమతుల్లేనట్టు స్థానికులు చెబుతున్నారు.

సోంపేటలో ఇలా..

సోంపేట ప్రధాన కేంద్రానికి ఆనుకుని కవిటి రహదారిలో, బేసిరామచంద్రాపురం గ్రామం రహదారికి ఆనుకుని పొలాల్లో వేస్తున్న ఎటువంటి అనుమతులు లేకుండానే భూస్వరూపాన్ని మార్చారనే విమర్శలు వస్తున్నాయి. అధికారులకు దరఖాస్తులు చేయకుండా ఇష్టారాజ్యంగా భూస్వరూపాన్ని మార్చేసి ప్లాట్లు సిద్ధం చేసి విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. సోంపేట–కవిటి రహదారిలో వేసిన లేఅవుట్‌లో సుడా నిబంధనలకు తూట్లు పొడుస్తూ రోడ్డు కోసం కేవలం సుమారు 20 అడుగులు మాత్రమే విడిచిపెట్టారు. మురుగు నీటి కాలువలకు, విద్యుత్ స్తంభాలు వేయడం కోసం స్థలాలు చూపించలేదు. పట్టించుకోవాల్సిన శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

అనుమతులు మంజూరు చేయలేదు



సోంపేట–కవిటి ప్రధాన రహదారికి ఆనుకుని వేసిన లేఅవుట్‌కు, బేసిరామచంద్రాపురంలో నిర్మితమవుతున్న లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– బి.అప్పలస్వామి, తహసీల్దార్, సోంపేట

నిబంధనలు ఇలా..

రియల్ ఎస్టేట్ వ్యాపారి భూస్వరూపాన్ని మార్చాలంటే రెవెన్యూ అధికారులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తరువాత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. సదరు భూమి పత్రాలు రికార్డుల పరంగా కచ్చితంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి. అధికారులు నిర్ధారణ చేసుకున్న తర్వాత నాలా టాక్స్ చెల్లించాలని తెలియజేయాలి. నాలా టాక్స్ చెల్లించిన తరువాత భూస్వరూపాన్ని మార్చడానికి అనుమతులు మంజూరు చేస్తారు.

నిషేధిత జాబితాలో లేఅవుట్ భూమి?

సోంపేట పట్టణానికి ఆనుకుని లేఅవుట్ వేసిన భూమి జిరాయితీ అయినప్పటికీ ప్రస్తుతం నిషేధిత భూముల జాబితా (22ఏ)లో ఉన్నట్లు తెలిసింది. ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు భూస్వరూపాన్ని మార్చకుండా ఉండాల్సినప్పటికీ రియల్ వ్యాపారులు భూస్వరూపాన్ని మార్చేసి లేఅవుట్‌గా సిద్ధం చేశారు. 18 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవుతో ఇళ్ల స్థలాలుగా విభజించి సుమారు 200 ప్లాట్లు సిద్ధం చేశారు. కొనుగోలుదారులు మోస పోకుండా ఉండాలంటే అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి అన్ని అనుమతులు వచ్చేదాకా క్రయవిక్రయాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే బేసిరామచంద్రాపురం రోడ్డు పక్కన పచ్చని పంటపొలాల మధ్యన లేఅవుట్ సిద్ధం చేస్తున్నారు. అధికారులకు దరఖాస్తులు చేయకుండా పంట పొలం భూస్వారూపాన్ని మార్చేశారు. దీంతో పంట కాలంలో సాగు నీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోంపేట మండలంలోని పలు పంచాయతీల్లో ఇప్పటికే వెలసిన లేఅవుట్లలో పది శాతం భూమి ప్రభుత్వానికి విడిచిపెట్టాలనే నిబంధన ఉన్నప్పటికీ ఆచరణలో అమలు కాలేదు.

కూటమి పాలనలో ప్రజా సంక్షేమం గాలికి..

- జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు


సమావేశంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కంచిలి: ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నేతలతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలంటూ ఎన్నికల ప్రచారంలో చెప్పుకొని, తీరా అధికారం చేపట్టిన తర్వాత వాటిని పూర్తిగా పెడచెవిన పెట్టేశారని దుయ్యబట్టారు. వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ 90 రోజులు నిలిచిపోయిందన్నారు. శాసన మండలిలో తాను ప్రస్తావించిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన జిల్లా యంత్రాంగంలో కదలిక వచ్చిందని ఎమ్మెల్సీ రామారావు అన్నారు. సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు గడచిన రెండు రోజులుగా జరిగిందని, సుమారు 732 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు.

కోవిడ్ సమయంలో కూడా..

ఐదు సంవత్సరాల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో.. రెండు సంవత్సరాలు కోవిడ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు నెలకున్నప్పటికీ ప్రజాసంక్షేమాన్ని విస్మరించలేదన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ సమస్యల పరిష్కారానికి దాదాపు రూ. 800 కోట్లు ఖర్చుపెట్టి వంశధార జలాలను పైప్‌లైన్ల ద్వారా తీసుకొచ్చి ప్రజలకు సరఫరా చేయడం జరిగిందన్నారు. పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించి జాతికి అంకితం చేసినట్టు గుర్తు చేశారు. కిడ్నీ బాధితులకు రూ. 10 వేలు చొప్పున పింఛన్ ఇచ్చిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కళ్ల ముందు చేసిన మంచి పనులు కనిపిస్తున్నప్పటికీ అసెంబ్లీ సాక్షిగా మంత్రి అచ్చెన్నాయుడు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని డయాలసిస్ కేంద్రాల్లో బెడ్స్ ఖాళీ లేక కిడ్నీ బాధితులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పడకల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. 'నీకు పదిహేను .. నీకు పదిహేను..'అంటూ టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు చేయలేదని జెడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్సీ విమర్శించారు. కంచిలి, సోంపేట ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, నిమ్మన దాస్, సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ నేతలు కడియాల ప్రకాశ్, ఇప్పిలి కృష్ణారావు, పిలక సంతోష్, ప్రకాశరావు పట్నాయక్, లడ్డు కేశవ పాత్రో, సల్ల దేవరాజు, మడ్డు వెంకటరావు, దుర్గాసి ధర్మారావు, పైల లక్ష్మీనారాయణ, రంగాల శ్రీనివాసరావు, కప్పల యుగంధర్ పాల్గొన్నారు.

ఆశీల వేలం పాట వాయిదా

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశీళ్ల వసూళ్ల కోసం మంగళవారం నిర్వహించిన వేలం పాట మరోసారి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన వేలం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ రావడం ఆలస్యం కావడంతో గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. మున్సిపాలిటీ వారిపాట రూ. 23 లక్షలకు ప్రారంభించగా ముందుగానే సిండికేట్‌గా మారిన ఆరుగురు పాటదారులు పోటీ పడకుండానే కలివిడిగా అందరి పేర్లు పోటీలో నమోదు అయ్యేలా రూ. 27 లక్షల వరకు పాట పాడారు. గతఏడాది కంటే ఇది తక్కువ కావడంతో మున్సిపల్ కమిషనర్ పాటను బుధవారానికి వాయిదా వేశారు. ఇటీవల కూడా వేలం పాట నిర్వహించగా.. అప్పుడు కూడా ఇదే పరిస్థితి తలెత్తడంతో వాయిదా పడింది.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

కాశీబుగ్గ: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఐదో వార్డు పరిధి నీలావురంకాలనీ రిట్టపాడు జంక్షన్ వద్ద ఆక్రమణకు గురైన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణ జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు పరిశీలించినట్టు చెప్పారు. సర్వే నివేదిక అందజేయాలని టౌన్ సర్వేయర్, వీఆర్వోలను ఆదేశించారు. అనంతరం నౌపడా వెంకటరావు లేఅవుట్‌ను పరిశీలించారు. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి సోమనాథ్ ఉన్నారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీలో రాయితీ

ఇచ్ఛాపురం: ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఏకమొత్తంలో ఈ నెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను బకాయిలను వన్‌టైమ్‌లో చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పన్ను బకాయిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీహెచ్‌సీకి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ వితరణ

పలాస: రెంటికోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి గ్లో సంస్థ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను వితరణ చేసింది. దీన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ ఎంతో అవసరమో ప్రజలకు తెలిసిందన్నారు. మాతృ,శిశు మరణాల తగ్గించి, మెరుగైన సమాజం కోసం వైద్య సిబ్బంది ప్రజల భాగస్వామ్యంతో పనిచేయాలని కోరారు. వైద్యాధికారి సునీల్ కుమార్, డాక్టర్ మౌనిక, ఫార్మసీ అధికారి బోనెల గోపాల్, రిషికేశవరావు, సత్యవతి, ఆదమ్మ, విమలాదేవి, ఈశ్వరమ్మ ఉన్నారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

పలాస: బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం ప్రారంభించారు. సుమారు రూ.60 వేలతో పూణేకు చెందిన వైఫోర్డు ఫౌండేషన్, హిందుస్థాన్ కోకోకోలా బెవరేజెస్ సంస్థ సంయుక్తంగా గ్లో సంస్థ ఆధ్వర్యంలో ప్లాంట్‌ను నిర్మించారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్వీ రమణరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్.బాలశంకరం, కుత్తుం లక్ష్మణరావు, పీరుకట్ల విఠల్, దువ్వాడ సంతోష్‌రాం నాయుడు, దువ్వాడ శ్రీహర్ష పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం


సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించిన కృష్ణశిలా విగ్రహ ప్రతిష్ఠ ఆరో వార్షికోత్సవాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కి సిందూర మర్ధన, సహస్ర నామార్చన, విశిష్ట అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. వార్షికోత్సవంలో భాగంగా సాయంత్రం వేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమి ఆధ్వర్యంలో అమ్మవారి కీర్తనల నృత్య ప్రదర్శన, భారతి రమేష్, భక్తి సంగీత విభావరి అలరించింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేయాలి


నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో పదో తరగతి పరీక్షల్లో మాస్ మాస్‌కాపీయింగ్ ఉదంతంలో 14 మంది ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయాలని కవిటి మండల ఉపాధ్యాయ సంఘ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇద్దివానిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిరసన తెలియజేశారు. యూటీఎఫ్ జిల్లా సమాఖ్య పిలుపు మేరకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారి నిరంకుశ వైఖరి నశించాలన్నారు. జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

సోంపేట: కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సోంపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్ సూచించారు. సోంపేట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లోని వాణిజ్య సంస్థలను మంగళవారం సందర్శించారు. వీటిలో పని చేస్తున్న కార్మికులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, రక్షణ చర్యలు పరిశీలించారు. వేసవి నేపథ్యంలో కార్మికుల భద్రతపై దృష్టిపెట్టాలని యజమానులకు సూచించారు.

నీటి సరఫరా పరిశీలన

కాశీబుగ్గ: ఉద్దానం ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకి తాగునీరు అందించడానికి ఉన్నతాధికారులతో కలిసి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశారాణితో కలిసి రామకృష్ణాపురం వద్ద వాటర్ సప్లయ్ ఇంటర్ కనెక్షన్ జాయింట్‌ను, కాశీబుగ్గ పాతజాతీయ రహదారి అక్కుపల్లి రోడ్డు జంక్షన్ వద్ద జాయింట్‌ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కనకరాజు, అసిస్టెంట్ ఇంజినీర్ కిరణ్ కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు అండగా..



సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులకు బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ అండగా నిలిచింది. కాస్మోటిక్స్ వస్తువులు, పౌష్టిక ఆహార పదార్థాల కోసం ఒక్కొక్కరికీ రూ. 600 చొప్పున్న రూ. తొమ్మిది వేలు విలువైన వస్తువులను సంస్థ ఛైర్మన్ సీవీ రాజు మంగళవారం అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరానికి 58 మంది విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. పదో తరగతిలో 90 శాతం మార్కులు దాటిన వారికి మెరిట్ అవార్డులు ఇవ్వనున్నట్టు చెప్పారు. హెచ్‌ఎం భానుప్రకాష్ ఉన్నారు. – సంతబొమ్మాళి

తప్పని నిరీక్షణ..



రేషన్‌కార్డుదారులకు తిప్పలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీ నాటికి ఈకేవైసీ అప్‌డేట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కార్డులో పేర్లు ఉన్నవారు రేషన్ డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడ జనం భారీగా ఉంటుండడంతో ఎండలోనే నిరీక్షిస్తున్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ శ్రీనివాసనగర్ డీలర్ వద్ద మంగళవారం ఇదే పరిస్థితి కనిపించింది. – కాశీబుగ్గ

వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి



ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థల్లో మంగళవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉద్యోగాల పేరిట జరిగే మోసాలు, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ కైలాస్, ఏఏఐ జిన్నారావు ఉన్నారు. – వజ్రపుకొత్తూరు

నిరంకుశ పాలనపై అధికారులకు నివేదన

- ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం
- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్


వివిధ విషయాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి నియోజకవర్గంలో జరుగుతున్న నిరంకుశ పాలన, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు నివేదించినట్లు పార్టీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు, దళితులపై దాడులు పెరిగిపోయావని ఆందోళన వ్యక్తం చేశారు. చిరుద్యోగుల తొలగింపు, స్థానిక సంస్థల అధికారాలను నిర్వీర్యం చేయడం, గ్రామాల అభివృద్ధిని కూటమి నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. ప్రజాప్రతినిధులను విస్మరించడం, అడ్డగోలు తీర్మానాలను ప్రోత్సహిస్తూ నిరంకుశ పాలన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడుపై దశల వారీగా న్యాయ పోరాటం చేస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఘటనలపై గతంలో టెక్కలి ఆర్డీలో ఎం.కృష్ణమూర్తిని కలిసి వివరించామన్నారు. హుద్‌హుద్ ఇళ్ల పట్టాలు, జగనన్న కాలనీలో ఇంటి పట్టాలను రద్దు చేయడం, ఇళ్ల బిల్లుల విషయంలో పక్షపాత ధోరణి అనుసరించడం, 136 పంచాయతీల్లో అన్యాయంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, వంట ఏజెన్సీ కార్మికులు, సీఎఫ్‌లు, శానిటేషన్ సిబ్బంది, చౌక ధరల దుకాణం డీలర్ల తొలగింపు, పింఛన్లు నిలిపివేయడం, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లు, దళితుల ఇళ్లల్లో చొరబడి దాడులు చేయడం వంటి చర్యలపై ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కోటబొమ్మాళి మండల కేంద్రంలో టీడీపీ నాయకుడు దౌర్జన్యంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తూ చేపడుతున్న కట్టడాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాప్రతినిధుల అధికారాలను అపహాస్యం చేయడంపై న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నాలుగు మండలాల ప్రజాప్రతినిధులతో ధర్నా చేశామన్నారు. తాజాగా ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్, ప్రజాప్రతినిధుల తీర్మానం లేకుండా అడ్డగోలుగా ఎన్ఆర్ఈజీఎస్ పనులకు తీర్మానాలు చేయడంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేసినట్లు తిలక్ చెప్పారు. నియోజకవర్గంలో నిరంకుశ పాలపై అధికారులకు నివేదన చేస్తూ ప్రతీ కార్యకర్త, సామాన్య ప్రజల కోసం అండగా, మంత్రి అచ్చెన్నాయుడుకు వ్యతిరేకంగా దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ తరపున అండగా ఉంటామన్నారు.

నవోదయకు పలువురు ఎంపిక


వసుస్వరూప్


అక్షయ్‌రూప్


ఆర్.మణికంఠ


బి.నక్షిత్ర


బంగారు కోటేశ్వరరావు


బుద్ధ నవ్యశ్రీ

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన పొందూరు వసుస్వరూప్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. జవహర్ నవోదయ ఎంట్రన్స్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు.

కవిటి: కవిటి ప్రాథమిక పాఠశాలకు చెందిన పార్నంది అక్షయ్‌రూప్‌శర్మ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం బి.వరలక్ష్మి తెలిపారు.

వజ్రపుకొత్తూరు రూరల్: పెదవంక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న బత్తిని నక్షిత్ర, రాజాం మణికంఠ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్టు ఉపాధ్యాయులు చెప్పారు.

కంచిలి: కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థి బంగారు కోటేశ్వరరావు జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు.

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు పాఠశాలకు చెందిన బుద్ధ నవ్యశ్రీ నవోదయ పాఠశాలలో చేరేందుకు ఎంపికై నట్టు ప్రధానోపాధ్యాయులు సాయిరామ్ తెలిపారు.

జీడి, కొబ్బరి బోర్డుల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: పలాసలో జీడి, సోంపేటలో కొబ్బరి బోర్డుల ఏర్పాటుకు కృషి చేస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రెండు రోజులు జరగనున్న జిల్లా స్థాయి జీడి, కొబ్బరి రైతుల సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి జిల్లాలోని జీడి, కొబ్బరి రైతుల సమస్యలను ప్రస్తావిస్తానన్నారు. మొదటి రోజున శాస్త్రవేత్తలు రైతులు ఎదుర్కొంటున్న చీడపీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కొత్త వంగడాలు, పునరుద్ధరణ, ఎగుమతులు, దిగుమతులు గురించి సలహాలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు కె.ఉమామహేశ్వరరావు, జి.స్రవంతి, టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ హెచ్.కె.శైలజ, పలాస, వజ్రపుకొత్తూరు ఉద్యానవనశాఖాధికారులు సి.హెచ్.శంకర్‌దాస్, కె.సునీత, పి.మాధవీలత, ఉద్యాన వన సహాయకులు పాల్గొన్నారు.